www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్
కోనసీమ



అంగన్‌వాడీ కేంద్ర్రాల పనివేళల్లో మార్పులు

ప్రజాశక్తి-అమలాపురం

ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసిందని జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ ఎం. ఝాన్సీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కేంద్రాలు పనిచేస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను ఇంటికి పంపిస్తారన్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఒఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మే 1 వ తేదీ నుంచి 15 వరకు అంగన్ వాడీ కార్యకర్తలు, మే 16 నుంచి 30 వరకు అంగన్ వాడీ సహాయకులు వేసవి సెలవులను ఉపయోగించు కోవచ్చన్నారు. జిల్లా లోని లబ్ధిదార్లు, సిడిపిఒలు, సూపర్ వై జరు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలుఈ విషయములు గమనించాలన్నారు.

వైసిపిని బంగాళాఖాతంలో కలిపేద్దాం

▸ రోడ్ షోలో చంద్రబాబు

ప్రజాశక్తి-రామచంద్రపురం, రావులపాలెం

వచ్చే ఎన్నికల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపేద్దామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం ప్రజాగళంలో భాగంగా రావులపాలెం, రామచంద్రపురంలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. రావులపాలెం, ద్రాక్షారామంలో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. ప్రజలను మోసగించిన వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పాలన చేతగాని ముఖ్యమంత్రి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ధరలను అదుపు చేయడం ముఖ్యమంత్రి జగన్‌కు చేతకాలేదన్నారు. నిత్యావసర ధరలు సామాన్యలకు అందనంత ఎత్తులో ఉన్నాయన్నారు. రూ.60 విలువైన చీప్ లిక్కర్‌ని రూ.200 లకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నారు. పూర్తి మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న ముఖ్యమంత్రి జగన్, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇసుక పాలసీ మరింత దారుణంగా తయారైందన్నారు. తమ హయాంలో రూ.1000 రూపాయలను ఇసుకను ఇప్పుడు రూ.5వేలకు పైగా విక్రయిస్తున్నారన్నారు. దళితుల పట్ల ముఖ్యమంత్రినకి చిత్త శుద్ధిలేదన్నారు. తమ హయాంలో ఎస్‌సిలకు మంచొ గుర్తింపునిచ్చామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌ను చేశామన్నారు. అదే చంద్రబాబు బ్రాండ్ అని ఆయన వ్యాఖ్యానించారు. తన హయాంలోనే హైదరాబాదును అభివృద్ధి చేశానని రాష్ట్రంలోనూ కియా మోటార్స్‌ను తీసుకువచ్చామని ఆయన గుర్తు చేశారు. ఒకటో తేదీని పింఛన్లు అందించడంలో విఫలమయ్యారన్నారు. తాము ఎన్నికల కమిషన్, చీఫ్ సెక్రటరీతో మాట్లాడానని, మూడో తారీకు వచ్చినా పింఛన్లు ఇవ్వలేదన్నారు. దీంతో వద్ధులు ఎంతో ఇబ్బందులు గురవయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆలోచించి ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధూర్, రామచంద్రపురం ఎంఎల్ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, కొత్తపేట అభ్యర్థి బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, నాయకులు రేవు శ్రీను, చిక్కల దొరబాబు, జనసేన పార్టీ నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

చంద్రబాబుకు ఘన స్వాగతం

ఆలమూరు రావులపాలెంలో బుధవారం టిడిపి అధినేత చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించారు. సభ ముగింపు అనంతరం రామచంద్రపురం ప్రజాగళం బహిరంగ సభకు రోడ్డు మార్గంలో వెళ్తూ మార్గం మధ్యలో ఆలమూరులోని ప్రముఖ పారిశ్రామికవేత్త, మురళీకష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, అతని తనయుడు మురళీకృష్ణ విజ్ఞప్తి మేరకు వారి నివాసం వద్ద పాపారావు కుటుంబ సభ్యులు, మురళీకృష్ణ అభిమానులు, విఎంకె.ఫాలోవర్స్, స్థానిక టిడిపి నేతలు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు కాన్వాయ్ నుంచి దిగి అభిమానులకు అభివాదం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేసి, గెలుపు కోసం పాటుపడాలని వారితో అన్నారు. అలాగే మురళీకష్ణ ఏర్పాటుచేసిన గజమాలను క్రేన్ సహాయంతో చంద్రబాబుకు వేశారు. అభిమానంతో పాపారావు కుటుంబ సభ్యులు ఇచ్చిన టీ చంద్రబాబు తాగడం విశేషం. కార్యక్రమం విజయవంతం అవ్వడానికి కృషి చేసిన ఆలమూరు టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, పత్రిక విలేకరులకు మురళీకృష్ణ కతజ్ఞతలు తెలియజేశారు




ఆలమూరులో టీ తాగుతున్న చంద్రబాబు

పింఛన్ కోసం వచ్చి కుప్పకూలిన వృద్ధుడు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పింఛన్ కోసం వచ్చిన ఓ వృద్ధుడు సచివాలయం వద్ద కుప్పకూలిపోయిన ఘటన అమలాపురం మండలం పేరూరులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇవి. అమలాపురంలోని పోస్టల్ కాలనీ వద్దగల పేరూరు గ్రామ సచివాలయం 4 వద్దకు పింఛన్ తీసుకోవడానికి వచ్చిన కొంకాపల్లి కి చెందిన కురసాల నరసింహమూర్తి కూర్చోవడానికి స్థలం లేక ఉదయం నుంచి ఎండలో నిలబడి ఉన్నాడు. ఉదయం 10 గంటలకు సచివాలయానికి వచ్చిన సిబ్బంది పింఛన్లు గురువారం ఇస్తామని బుధవారం రాలేదని చెప్పడంతో ఆందోళనకు గురైన వద్ధుడు రోడ్డుపై కుప్పకూలిపోయాడు. ఈ సంఘటనకు భయభ్రాంతులకు గురైన మిగతా పింఛను దారులు ప్రతినెలా ఒకటవ తేదీనే వాలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇచ్చేవారనితెలిపారు ఇప్పుడు ఎన్నికల పేరుతో సచివాలయానికి రమ్మన్నారని అయితే ఏ సమయానికి రావాలో చెప్పకపోవడంతో తాము ఉదయాన్నే వచ్చి సచివాలయం వద్ద వేచి చూస్తున్నామన్నారు. వద్ధాప్యంతో బాధపడుతున్న తమకు ఇంత దూరం వచ్చి పింఛను తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉందని వాపోయారు.



పేరూరు సచివాలయం వద్ద కుప్పకూలిపోయిన వృద్ధుడు

వరిలో చీడపీడల నిర్మూలనకు సూచనలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వరిపై ఆశించే వివిధ చీడపీడల నిర్మూలనకు చేపట్టవలసిన సస్యరక్షణపై రైతులకు జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త (సస్యరక్షణ) డాక్టర్ ఎం.నందకిషోర్ సూచనలు చేశారు. గోపవరంలోని అభ్యుదయ రైతు అయితాబత్తుల ఉమామహేశ్వరరావుకు చెందిన ఎంటియు 1293 వ్యవసాయ క్షేత్రాన్ని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా ఏరువాక కేంద్రం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.నందకిషోర్ బుధవారం సందర్శించారు. ఆయనతో రైతులతో మాట్లాడారు. ఎంటియు 1293 వరి రకం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కొత్తగా రూపొందించారన్నారు. ఈ వరి రకం ముఖ్యంగా చవుడు (ఉప్పు) తట్టుకునే రకమని దీని పంట కాలం 120 నుంచి 125 రోజులు అని తెలిపారు. గింజ పొడవు సన్న రకం అని దిగుబడి ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు వస్తుందని తెలిపారు. సుడిదోమ నివారణకుపై మెట్రోజైన్ 0.6 గ్రాములు లేదా ట్రై ఫ్లూమిజో పైరిం 0.48 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఇటువంటి వ్యవసాయ క్షేత్రాలు జిల్లాలో మరో మూడు ఉన్నాయని వాటిని కూడా సందర్శించామన్నారు. అభ్యుదయ రైతులు ఎ.దొరబాబు, ఎస్.రామారావు, ఎ.ఉప్పరయ్య, ఎస్.సతీష్, ఎస్.సత్తిబాబు, జి.బాలరాజు, ఆర్. వెంకటేశ్వరరావు, ఎస్.ఏసు తదితరులు పాల్గొన్నారు.




వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నందకిషోర్, రైతులు

ఎన్నికల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు దళాలు, జిల్లా పోలీసులు సమన్వయంగా పని చేయాలని జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు, సమస్యాత్మక గ్రామాల్లో అమలాపురం సబ్ డివిజన్ కాట్రేనికోన పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లగరువు, సాపివారిపేట, బలుసుతిప్ప, వడ్డీవారిపేట గ్రామాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. ఎన్నికల విషయమై ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకొనుటకు ప్రజలకు భరోసా కల్పిస్తున్నామన్నారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బృందం




అందజేస్తున్న 'గుడ్‌సీడ్' ఫౌండర్ రమణారావు

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి అవసరమైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ను అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు గుడ్ సీడ్ ఫౌండేషన్, మిరాకిల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సమకూర్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న పి. గన్నవరం మండలం పెద కందాలపాలెంకు చెందిన దిరిసాల ఏసురత్నం కుమార్తె శాంతకుమారి కి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అవసరం ఏర్పడింది. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉన్న శాంతకుమారి సమస్యను పలువురు రమణారావు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రమణారావు బుధవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో శాంత కుమారి కి అవసరమైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ను ఆమె తల్లిదండ్రులు కృప,ఏసురత్నంలకు అందజేశారు. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ను సమకూర్చిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు శాంతకుమారి ఆమె కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ లు కోరుకొండ ఏసురత్నం,పి. ప్రశాంత్ కుమార్, వినోద్,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఓటు హక్కును వినియోగించుకోవాలి

కొత్తపేట ఆర్‌డిఒ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆలమూరు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కొత్తపేట ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్లు విజయ రేఖ, జానకి రాఘవలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, గాలి పుష్కలంగా ఉండాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు తప్పకుండా అందుబాటులో ఉండాలన్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆర్‌డిఒ ఆదేశించారు. మండలంలో గల 62 పోలింగ్ కేంద్రాల్లో ఆలమూరు, పినపళ్ళ, గుమ్మిలేరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారంలో గల 31 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, వాటన్నిటిని పరిశీలించామని స్థానిక విలేకరులకు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అలజడులు కలుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సందీప్ కుమార్, కార్యదరస్సులు సంజీవరెడ్డి, మోక్షంజలి, రేణుక, సత్యనారాయణ, రాజు, వీర్రాజు, విఆర్‌ఒ లు సూర్యప్రకాష్, జ్యోతి, రామకృష్ణ, రాంపండు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మడికి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్‌డిఒ సత్యనారాయణ

హోమ్ ఓటింగ్ పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు దివ్యాంగులకు, వయో వద్దులకు ఎన్నికల సంఘం కల్పించిన హోమ్ ఓటింగ్ విధానాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని వికలాంగ ఎన్నికల నోడల్ అధికారి బివి.రమణ సూచించారు. కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం అవరణలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వికలాంగులకు హోమ్ ఓటింగ్ విధానం పై క్రమబద్ధమైన ఓటర్ విద్య ఎన్నికలలో భాగస్వామ్యం(స్వీప్) కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగాహన సదస్సు నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ఓటింగ్ శాతం ఎంతో ముఖ్యమని ఎన్నికల సంఘం గుర్తించి, వికలాంగులు పరియు 85 ఏళ్లు పై బడిన వారు నిష్పక్షపాతంగా ఓటు ను వినియోగించుకునేందుకు ఈ దఫా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ కు నాంది పలికిందన్నారు. ఈ విధానాన్ని వికలాంగులు మరియు వయో వద్ధులు ఇంటి వద్ద నుంచే హోమ్ ఓటింగ్ విధానం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని వివరించారు. హోమ్ ఓటింగ్ ద్వారా ఓటువేసే వారికి ఏప్రిల్ 18 నుంచి 22 లోపల ఫారం 12డి దరఖాస్తులను అందించి మే 13న జరిగే ఓటింగ్ కు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మదన్ మోహన్ రావు మాట్లాడుతూ నియోజక పరిధిలోని 268 పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే వికలాంగులు మరియు వయో వద్ధులకు ర్యాంప్, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ రోజున ఉదయం 7.30 గంటలోపు వస్తే ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడమే కాకుండా, సులువుగా ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి దుర్గారావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో శిబిరాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టామని,ప్రతి కేంద్రం వద్ద వీల్ చైర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ తోపాటు అవసరమైన మందులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడం పై ప్రతిజ్ఞ చేశారు.దీనిలో భాగంగా నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓటు హక్కు వినియోగం అవగాహన ర్యాలీ ని నోడల్ అధికారి రమణ జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీ జాతీయ రహదారి 216 పై సాగింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట రామి రెడ్డి, ఎఇఆర్‌ఒ మరియు ముమ్మిడివరం తహశీల్దార్ బి.శ్రీను నాయక్, ఎంపిడిఒ నరసింహారావు, బిఎల్‌ఒలు, ఎన్నికల సిబ్బంది మరియు వికలాంగుల జెఎసి నాయకులు సురేష్ లంకరాజు, సీనియర్ సిటిజన్స్ మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పతిజ్ఞ చేస్తున్న అధికారులు తదితరులు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సుమలత

ప్రజాశక్తి-ఆలమూరు

వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.సుమ లత అన్నారు. మండలంలోని చొప్పెల్ల పిహెచ్‌సిలో జరిగిన అవగాహనా సదస్సులో ఆమె బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక "ప్రజాశక్తి" తో మాట్లాడుతూ మనం అధిక ఉష్ణోగ్రతకు గురికావడంతో శరీరంలోని ఇమ్యూనిటీని కోల్పోయి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సాధారణంగా ఎండ తీవ్రత, విశ్రాంతిలేని పనుల వత్తిడితో కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుందన్నారు. వేడికి సంబంధించిన సమస్యలలో వడదెబ్బ చాలా తీవ్రమైనదని, వేడి వాతావరణంలో తరచు వ్యాయామం, బరువైన పనులు చేసినప్పుడు సరియైన మోతాదులో ద్రవపదార్థాలని తీసుకోలేనప్పుడు ఇది సోకుతుందన్నారు. ఈ వడదెబ్బ గురయ్యే వారిలో పిల్లలు, క్రీడాకారులు, అతిమూత్ర వ్యాధి వారు, మద్యం ప్రియులు, అధిక వేడికి అలవాటు లేనివారు ఉండవచ్చన్నారు. కొన్ని సందర్భాల్లో రైతులు చెలకు వినియోగించే మందుల వలన కూడా మనిషి వడదెబ్బకు గురయేలా చేస్తాయన్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బలో కనబడే అతి ముఖ్య లక్షణం స్పష్టంగా అధిక శరీర ఉష్ణోగ్రత(104 డిగ్రీల ఫారన్ హీట్ కంటే ఎక్కువ) దీనితో పాటు వ్యక్తిగత ప్రవర్తనలో మార్పులు కూడా కనబడుతాయన్నారు. ఇవి అయోమయం నుంచి అపస్మారక స్థితి వరకూ వుండవచ్చు అన్నారు. గుండె, నాడి కొట్టుకోవడం వేగంగాను, తక్కువగా శ్వాస తీసుకోవడం, నిలకడలేని రక్తపోటు, చెమట పట్టకుం డా అపస్మారక స్థితి, తల తిరగడం, తేలి పోవడం, తలపోటు, వికారపు వాం తులు, పెద్దల్లో స్పృహ కోల్పో తార న్నారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ ఉంటామని ఆమె అన్నారు.



సుమలత,అడిషనల్ డిఎంహెచ్‌ఒ

ప్రాథమిక చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లబరచాలని ఆమె అన్నారు. ఇందుకు వీలయితే రోగిని చల్లని నీటి టబ్ లో ఉంచాలన్నారు. చల్లని తడి బట్టతో ఒళ్ళంతా అద్దుతూ వుండాలన్నారు. రోగి శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల ఫారన్ హీట్‌కు తగ్గినప్పుడు చల్లని నీటిలో నుంచి తీసేసి చల్లటి గదిలో పడుకోబెట్టాలన్నారు. ఉష్ణోగ్రత పెరగకుండా రోగికి ఒఆర్ఎస్, ఉప్పు కలిపిన గ్లూకోజ్ తాగునీటిలో కలిపి ఇవ్వాలన్నారు. ఎటువంటి మందులు వేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండడానికి, బయట పనులు చేసేటప్పుడు ఎక్కువగా పానీయాలు తాగి శరీర ఉష్ణోగ్రతని మాములుగా ఉంచు కోవాలన్నారు. కెఫీన్, మద్యానికి తప్పకుండా దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సువర్చల, డాక్టర్ మల్లికార్జునరావు, ఎంపిహెచ్‌ఒ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సూర్యనారాయణ, హెచ్‌విఎఆర్‌బి మణి, హెచ్ఎస్ శివప్రసాద్, ఎఎన్ఎంలు ఆశాలు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలతో గొల్లపల్లి సమావేశం

ప్రజాశక్తి-రాజోలు

సోంపల్లి గ్రామంలో వైసిపి గ్రామశాఖ అధ్యక్షుడు కొంబత్తుల బాలయోగి అధ్యక్షతన బుధవారం జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశానికి రాజోలు వైసిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మరోసారి వైసిపిని గెలిపిస్తాయన్నారు. ప్రజలంతా జగన్ రెండవసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు జగన్ తోనే సాధ్యమని అన్నారు. తనను ఎంఎల్‌ఎగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధిలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ రావు, కూనపురెడ్డి రాంబాబు, తెన్నేటి కిషోర్, బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, కట్టా సత్యనారాయణ, బుంగ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన శివారు అడవిపేట గ్రామంలో మాదే యోగేశ్వరి నాయకత్వం లో బుధవారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వైసిపి నాయకుడు రాగుర్తి సత్యనారాయణ 150 మంది అనుచరులు తో బుచ్చిబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. అలాగే వెంకమ్మ చెరువు గ్రామం నుండి పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, మండల పార్టీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరావు, చెల్లి అశోక్ , జొన్నాడ రాజారావు, రేవు రమేష్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రు, తిళ్లకుప్ప, మొల్లిచెరువు, దొడ్డతిప్ప తదితర గ్రామాల్లో ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ వైసిపి అభ్యర్థి బుధవారం ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో పొన్నాడకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. టి.కొత్తపల్లి ఎంపిటిసి సభ్యుడు కొమనపల్లి శ్రీను ఆధ్వర్యంలో పొన్నాడ సతీష్ కుమార్ తదితరుల సమక్షంలో టి.కొత్తపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో అరుంధతి నగర్, జై భీమ్ నగర్ కు చెందిన 50మంది ఎంఆర్‌పిఎస్ నాయకులు వైసిపిలో చేరారు. వీరిని పార్టీలో ఆహ్వానించి కండువా కప్పి పార్టీలో స్వాగతం పలికారు. ప్రచారంలో ఆయన వెంట వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతి రాజు, జెడ్‌పిటిసి సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** పథకాలన్నీ యథాతథంగా అమలు చేసి పేదలందరికీ మళ్ళీ మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఓటర్లను కోరారు. బుధవారం ఉప్పూడి, బంటుమిల్లి, గోర గనమూడి, పెనుమల్ల, లక్ష్మీవాడ, గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, ఎంపిపి పాలెపూ లక్ష్మీ ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహ మూరి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -కాట్రేనికోన

ఎన్నికల ప్రచారాన్ని ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలెపు ధర్మారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కాట్రేనికోన గ్రామానికి చెందిన పాలెపు ధర్మారావు కు టిక్కెట్ విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన స్వగృహం నందు బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో టిక్కెట్ కేటాయించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని పల్లంకుర్రు గ్రామం నుండి మొదలు పెడతామని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్తామన్నారు. పేద ప్రజలకు మేలు కలగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లోని అంశాలను గడప..గడపకూ తెలియజేసి ప్రజల మద్దతు కూడగడతానని అన్నారు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అయితా బత్తుల పండ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

5 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన మానే మంగ ఐదు లీటర్ల సారాను విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివారలు ఇవి. రావులపాలెం సిఐ శ్రీరామ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ యస్.శ్రీనివాసు సిబ్బంది మండలంలోని గ్రామాల్లో సారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అంకంపాలెం గ్రామ శివారున సారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన మానే మంగ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీన చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితురాలిని కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు


నగదు స్వాధీనం చేసుకున్న ఎంపిడిఓ శ్యామ్ సుందర్

రూ.3 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

తగిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కాకినాడ ట్రెజరీలో జమ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సామర్లకోట ఎంపిడిఓ దుర్గా శ్యామ్ సుందర్ చెప్పారు. మంగళవారం రాత్రి స్థానిక జి.రాగంపేట రోడ్ జంక్షన్ వద్ద మండలంలోని వేట్లపాలెంకు చెందిన బొడ్డు సంతోష కుమార్ నుండి రూ.3 లక్షలు నగదును సరైన ధవీకరణ పత్రాలు ఇవ్వనందున స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ భవనం వద్ద గుర్తు తెలియని యాచకుడు మృతి చెంది ఉండగా గ్రామస్తులు గుర్తించి పంచాయతీ అధికారులకు తెలియజేశారు. పంచాయితీ కార్యదర్శి భార్గవ్, విఆర్ఓ వీరబాబు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి ప్రతి శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, యాత్రికులను యాచిస్తూ జీవనం గడుపుతుంటాడని, అతని వివరాలు తెలియవని స్థానికులు తెలిపారు.

పట్టుబడ్డ వాహనంపై కేసు నమోదు

ప్రజాశక్తి-పిఠాపురం

పాదగయ సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక వాన్‌ను పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా వైసిపి చెందిన జెండాలు, పోస్టర్లు, టోపీలు, డమ్మీ ఇవిఎంలు ఉండడాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఎ ఎస్వీఎస్ఎన్ వర్మ అక్కడికి చేరుకుని వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రవాణాకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. డ్రైవర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుంచి తుని వైపు ఎన్నికల ప్రచార సామగ్రి తీసుకు వెళ్తున్నారని ఎన్నికల సామాగ్రి రవాణాకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో సామగ్రి అక్రమంగా రవాణా చేస్తున్నారని గుర్తించి డ్రైవరు, వాహనంపై ఎన్నికల నియమావళి అనుసరించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

భార్యను వేధించిన కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-పిఠాపురం

వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి బుధవారం తీర్పు చెప్పారు. పట్టణంలోని అగ్రహారానికి చెందిన ఎ.కామరాజు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని ఆయన భార్య కుమారి 2018లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ పి.శోభన్ కుమార్ కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఎపిపి ఎ.నాగ లీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

ఎన్‌టి.రాజాపురం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో యర్ర అప్పలనరస కుమార్తె సత్య మణికంఠ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్టు ఆమె తల్లి ఫిర్యాదు ఇచ్చారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

జగన్నాథపురం వద్ద 50 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్టు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. బుధవారం మండలంలోని జగన్నాథపురంలో చెక్‌పోస్టు వద్ద పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేటకి చెందిన చిక్కాల సాయి సతీష్ బైకుపై 50 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. తనకు వచ్చిన సమాచారం మేరకు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్న చాగల్లు గ్రామానికి చెందిన కలేరియా మంగారావు అరెస్టు చేశామన్నారు. అతని నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

ఓటరు అవగాహనా కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

క్రమబద్ధమైన ఓటరు, విద్య ఎన్నికలలో భాగస్వామ్యం పేరున ఓటర్లలో చైతన్యాన్ని తీసుకుని వచ్చేందుకు ఓటరు అవ గాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఎటు వంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియో గం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చా రు. ఓటు హక్కును వినియోగిం చుకునే వారు కుల, మత, రాజకీయ ప్రలోభాలకులోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వారు, వికలాంగులకు కల్పించిన హోం ఓటింగ్ విధానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటు వేయడానికి వచ్చిన వారికి పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించామని, 18 సంవత్సరాలు నిండిన వారు ఎవరైనా తమ ఓటు నమోదు కానట్లయితే ఫాం-6ను ఆన్లైన్ లేదా బూత్ లెవల్ అధికారిని కలిసి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భ యంగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలన్నారు. ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు సదుపా యాల కల్పనకు సాక్ష్యం యాప్ ద్వారా ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభా వంతులకు ఎన్నికల కమిషన్ పలు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాలోని వికలాంగులంతా శతశాతం వారి ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలను కల్పించడం జరుగుతోందన్నారు. ఎన్నికల కమిషన్ వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలను కల్పించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విభిన్న ప్రతి భావంతుల కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్ష్యం యాప్, ఎంతో సహాయకారిగా ఉంటుందని, దీనిని దివ్యాంగులు ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు.. 85 సంవత్సరాలు వయ సు పైబడిన మంచాలకే పరిమితమై నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులు హోమ్ ఓటింగ్కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా లో వికలాంగులుగా నమోదై ఉండి. సదరం ధ్రువీ కరణ పత్రం ప్రకారం తమకు 40 శాతం పైబడి వికలాం గత్వం ఉంటే వారు ఇంటివద్దనుంచే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా హోమ్ ఓటింగ్ కోసం ముందస్తుగా దర ఖాస్తు చేసుకోవా ల్సి ఉంటుందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం కావాలన్నా, ఓటరు జాబితాలో పేరు తెలుసు కోవాలన్న తమ పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసు కోవాలన్నా వీల్ చైర్, వలంటీర్ సౌకర్యం కావాల్సివచ్చినా ఈ యాప్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. వాయిస్ అసిస్టెంట్, తదితర సదు పాయాలు కూడా ఈ యాప్లో ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా వీల్ చైర్లను ఎన్నికల రోజు అందుబాటు లో ఉంచుతామని చెప్పారు. అంధు లకు బ్రెయిలీ లిపిలో ఓటరు స్లిప్పులను పం పిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపరు ఏర్పా టు చేస్తామని, దాని ద్వారా తమకు నచ్చిన అభ్యర్థి కి ఓటు వేయవ చ్చునన్నారు. విభిన్న ప్రతిభా వంతుల కు అనుకూల ంగానే ఓటింగ్ ప్రక్రియ ను రూపొందించినట్లు వివరించారు.


కలెక్టర్ హిమాన్షు శుక్లా

పెదపట్నంలంకలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి -మామిడికుదురు


కోదండ రామ చంద్ర పాల శిలా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం

పెదపట్నంలంక దేవి సెంటర్లో ముత్యాల సత్తిరాజు సీతమ్మల కుమారులు, కూతుర్లు జ్ఞాపకార్థం వారి మనుమలు, ముని మనుమలు, సమకూర్చిన కోదండ రామ చంద్ర స్వామి పాల శిలావిగ్రహ ప్రతిష్టాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. ముత్యాల వీర వెంకట లక్ష్మీ సత్యనారాయణ శ్రీదేవి దంపతులు, అమ్మిరాజు, కుమారి దంపతులు, దుర్గాప్రసాద్, ఉషాదేవి దంపతుల జంటలు ప్రతిష్ఠకర్తలుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గురువారం భజన కళాకారులచే కార్యక్రమం, శుక్రవారం ఏకాహం కలశ స్థాపన జరుగుతుందని నిర్వాహక కమిటీ తెలిపింది.

ధర్మారావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి- తాళ్లరేవు

కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ టికెట్ లభించిన మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పాలెపు ధర్మారావును పలువురు అభినందించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సుమారు పది మంది పోటీ పడగా ధర్మారావును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధినాయకత్వం ఎంపిక చేసింది. కాంగ్రెస్ పార్టీ తరఫున 1985లో ఆయన ఏకగ్రీవంగా ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. 2005 కాంగ్రెస్ పార్టీ జెడ్‌పిటిసిగా గెలుపొందారు. పార్టీలో జిల్లా స్థాయిలో క్రియాశీలక పదవులు నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ సామాజిక వర్గానికే చెందిన ధర్మారావుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలోని మితగా వర్గాలతో పాటు, మత్స్యకార సామాజిక వర్గ ఓట్లు చీలికకు ఆయన ఎంతవరకూ కారణమౌతారో అని నియోజకవర్గంలో పలువురు చర్చించుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- యంత్రాంగం

తాళ్లరేవు ప్రభుత్వం ద్వారా ఈ నెల 4వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో ఎఒ ప్రశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులతో స్నేహపూర్వకంగా మాట్లాడి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన గోనెసంచులు, తేమ శాతం నిర్ధారణ, బయోమెట్రిక్ యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకూ తాను పండించి తీసుకువచ్చిన ధాన్యం రకం వివరాలు పోర్టల్లో పొందుపరచాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన కఠిన చర్యలు తప్పవు అన్నారు. **యు.కొత్తపల్లి** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.జోగిరాజు సూచించారు. గురువారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలన్నారు జిపిఎస్‌తో కూడిన వాహనాల రిజిస్ట్రేషన్, తేమ శాతం చూసే విధానం, గోనె సంచులు లభ్యతపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిటి మురళీకృష్ణ, విఎఎలు, సొసైటీ సిఇఒలు పాల్గొన్నారు. **పిఠాపురం** పట్టణంలోని మండల కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఎడిఎ పి.స్వాతి, తహశీల్దార్ పి.లక్ష్మి రైతులకు ఎఫ్‌టిఒల ద్వారా రసీదులు ఇచ్చే విధానాన్ని, మిల్లులకు తరలించేందుకు రైతులకు గొనె సంచులు మంజూరు చేసే విధానాన్ని వివరించారు.

దళితుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-సామర్లకోట


సభలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్, దవులూరి దొరబాబు

దళితుల సంక్షేమానికి వైసిపి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎంఎల్ఎ అభ్యర్థి దవులూరి దొరబాబు చెప్పారు. స్థానిక పెద్దాపురం రోడ్డులోని హెలిప్యాడ్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన దళితుల సదస్సులో వారు మాట్లాడారు. దళితులు ఆర్థికంగా నిలదొక్కుకుంటే సమానత్వం సాధ్యమవుతుందని, అందుకు యువత కోసం కాకినాడలో స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటు చేసి, ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు అందించే విధంగా కార్యాచరణ చేస్తున్నట్టు చెప్పారు. ఒక్కో గ్రామానికి రూ.కోటి కేటాయిస్తూ 400 గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చెయ్యనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సదస్సులో మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, నాయకులు నేతల నాని, మడికి సోనియా, గోరకపూడి చిన్నయ్య దొర మాట్లాడారు. నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, నాయకులు లింగం శివ, ఆవాల రాజేశ్వరి, పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న సిఐ, ఎస్ఐ

నవోదయ పరీక్షలో విక్టరీ స్టడీ సర్కిల్ సత్తా

పజాశక్తి-కోటనందూరు

2024లో జోహార్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షలలో మండల కేంద్రమైన కోటనందూరులోని విక్టరీ స్టడీ సర్కిల్ ఉత్తమ ఫలితాలను సాధించిందని డైరెక్టర్ అండ్ కరెస్పాండెంట్ పి.చిన్ని తెలిపారు. గతేడాదిలో మూడు లిస్టుల్లోనూ 14 సీట్లు సాధించినట్టు తెలిపారు. 2024 ఏడాదిలో మొదటి లిస్టులో 8 సీట్లు సాధించి అనకాపల్లి, కాకినాడ జిల్లాలోనే అగ్రస్థానంగా నిలిచిందని అన్నారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కె.రిషిక్, కె.అమత, ఎ.మనోజ్, ఎస్.రిషి సంపత్, టి.వివేక్, ఐ.కార్తీక్, కె.స్వర్ణలతను తుని రూరల్ సిఐ ఎస్‌వివిఎస్.మూర్తి, ఎస్ఐ బి.శంకర్రావు, విక్టరీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ పి.చిన్ని అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు.

డ్రాయింగ్ పోటీల్లో పి.నవ్యశ్రీ (ప్రథమ), సిహెచ్.జ్యోత్స్న (ద్వితీయ), వ్యాసరచన పోటీల్లో కె.నాగేశ్వరి(ప్రథమ) పి.ధనలక్ష్మి (ద్వితీయ) బహుమతులు గెలుచుకున్నారు. విజేతలను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, నూకరాజు, శ్రీరామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి కుమార్, గోపాలకృష్ణ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 5న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ కాకినాడ డిఇఇ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపుదల పనుల నిమిత్తం కావున అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రము పరిధిలోని నరసింహరోడ్, శివాలయం వీధి, తారకరామనగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్, సుందర్ నగర్, పప్పుల మిల్లు ఏరియా, రిక్షాల పేట, పరదేశమ్మ పేట, ప్రసాదరావు నగర్, సత్యదేవి నగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీ నగర్, పద్మనాభ నగర్, మేకా నారాయణమ్మ తోట, కాపుల వీధి, మున్సిఫ్ జంక్షన్, కొవ్వూరు, డి-మార్ట్, శుభం కౌంటీ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

ముగ్గురు వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి- తాళ్ళరేవు

మండలం గోవలంక, పిల్లంక పంచాయతీలకు చెందిన ముగ్గురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ కె.ప్రభాకరరావు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు గోవలంక గ్రామానికి చెందిన కాశి ఏడుకొండలు, పోతుల పవన్ కళ్యాణ్, పిల్లంకకు చెందిన అయితాబత్తుల గోపాలకృష్ణ రాజీనామా చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ వలీ బాబు మాట్లాడుతూ ఆ వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గండేపల్లి

వేసవి దష్ట్యా ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నరేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద పాత్రికేయులతో మాట్లాడుతూ తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. తలపై టోపీ లేదా రుమాలు కట్టుకోవాలని, తెలుపు రంగు కాటన్ వస్త్రాలను ధరించాలని, కళ్ళకు రక్షణ కోసం సన్‌గ్లాసెస్ ఉపయోగించాలని, వీలైనంతవరకు ఇంట్లో ఉండడానికి ప్రయత్నించాలని, దాహం వేయకపోయినా తరచూ నీరు,ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఒఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. శరీరాన్ని డి హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ కార్బొనేటెడ్ శీతల పానీయాలు మానివేయాన్నారు.

పింఛన్ల కోసం లబ్ధిదారుల అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం


పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

ప్రతి నెలా ఒకటో తారీకు రాగానే తెల్లవారు జాము నుంచే తలుపు తట్టి వాలంటీర్లు పింఛన్లు సొమ్ము చేతికి అందించేవారు. ఎన్నికల పుణ్యమా అని ఈనెల పింఛన్లు సచివాలయాల వద్ద ఇస్తారని చెప్పడంతో వద్దులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం బుధవారం సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. పట్టణ పరిధిలోని పలు సచివాలయాలకు సాయంత్రం వరకు బ్యాంకుల నుండి డబ్బు డ్రా చెయ్యకపోవటంతో సాయంత్రం పింఛన్లు పంపిణీ చేశారు. అంతవరకు పింఛన్‌దారులు సచివాలయాల వద్ద అవస్థలు పడ్డారు.

NOTICE
IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION)BHIMAVARAM
I.A.NO.2014/2023 IN O.S.NO.93/1993
Between:
PENMETSA BHASKARA PEDDI RAJU
S/o Suryanarayana Raju
AND
Kalidindi Venkata Narasayamma
(Died... per LRS-RR 2 to 7) & 10 others

Whereas the Honourable court was pleased to order for issue of notice to the respondents in the above petition, and whereas the notices sent to the below Respondents were returned un-served, the Honourable court was pleased to order to serve the notices by paper publication.


1.**Kalidindi Kasi Annapoorna** W/o Late Rama Mohana Raju Aged 45 years, S/o Kama Raju, aged 52 years, R/o Sri Devi Apartments, 3rd Floor, T-3 Danavaipeta, Near State Bank Rajahmundry, East Godavari District.
2.**Kalidindi Sri Ramaraju** S/o. late Rama Mohana Raju Aged 45 years, Slo Kama Raju, aged 52 years. R/o Sri Devi Apartments, 3rd Floor, T-3 Danavai peta, Near State Bank Rajahmundry, East Godavari District.
3.**Kalidindi Ramakrishna Raju** S/o. late Rama Mohana Raju Aged 28 years,S/o Kama Raju,aged 52years, R/o Sri Devi Apartments,3rd Floor, T-3 Danavaipeta,Near State Bank Rajah mundry, East Godavari District.

Therefore notice is hereby issued to the above mentioned Respondents to appear in person or by a pleader before the Honourablce court on **22-04-2024 at 10.30am and** to present their case, is any. Failing which the petition will be heard and determined in your absence.

Published as per the orders of the Honourable Civil Judge(Senior Division),Bhimavaram

S/d. **M.V.S.VIJAYA KUMAR RAJU**
Advocate, **BHIMAVARAM**
Bhimavaram
31.03.2024

యానాం వార్తలు


నాయకులను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభిమానులు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - యానాం

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యానాంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వి.వైథిలింగం అన్నారు. యానాంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి తదితర నాయకులతో కలిస వైథిలింగం ప్రచారం చేశారు. తొలుత భూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బాలయోగి స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నారాయణస్వామి ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రోడ్ షో, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈరోడ్ షోలో వైథిలింగం మాట్లాడుతూ యానాంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి కోసం వలసబాట పట్టారని తెలిపారు. స్టేట్ బ్యాంక్ రోడ్, పిల్లారాయ వీధి, చిన్న సెంటర్, అంబేద్కర్ సర్కిల్, మెట్టకూరు, గోపాల్ నగర్ , కనకాలపేట, యుకెవి నగర్, భీమ్ నగర్ మీదుగా సావిత్రి నగర్ చేరుకుని అక్కడ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, స్థానిక నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, దవులూరి పతి, చక్రవర్తి, బీరాస్వామి, విళ్ల చిన్ని శ్రీవారి, లంక బంగారం, శ్రీధర్, రామకష్ణ, ప్రసాద్ రాజు, మున్నా, గణేష్, జాన్ పాల్గొన్నారు.

నవోదయకు 28 మంది రీజెన్సీ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - యానాం

2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక రిజన్సీ పబ్లిక్ స్కూల్ నుంచి 59 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాద్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యానాం రీజియన్‌లో రీజన్సీ పబ్లిక్ స్కూల్ నుంచి అత్యధికంగా ఎక్కువమంది విద్యార్థులు నవోదయకు ఎంపిక అవడంపై విద్యార్థులను రీజన్సీ సిరామిక్స్ లిమిటెడ్ ఎండి ఎన్.సత్యేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు అభినందనలు తెలిపారు.